## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలి
- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్


షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, ఆగస్టు 1 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం షాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది దవాఖానలో ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో షాబాద్ ప్రభుత్వ దవాఖానను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇటీవలే ఈ దవాఖానకు ఇద్దరు డాక్టర్లు నూతనంగా విధుల్లో చేరినట్లు స్పష్టం చేశారు. ప్రైవేట్ దవాఖానలకు దీటుగా ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. వివిధ రకాల వ్యాధులతో దవాఖానకు వచ్చిన ఏ ఒక్క రోగి కూడా నిరుత్సాహంతో వెనక్కి వెళ్లకుండా తప్పనిసరిగా వైద్యం చేసి పంపించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంతోష, డాక్టర్ తబుసమ్, సూపర్‌వైజర్ మెరీనా, సిబ్బంది ఉన్నారు.

## భూ సర్వే పరిశీలన

- ఐఏఎస్ శిక్షణలో భాగంగా కందనెల్లితండాలో పర్యటించిన
- వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి


కందనెల్లితండాలో భూ సర్వే విధానాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

పెద్దేముల్, ఆగస్టు 1 : ఐఏఎస్ శిక్షణలో భాగంగా వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి గురువారం కందనెల్లితండా గ్రామంలో పర్యటించారు. ఉమాహారతి ఐఏఎస్ శిక్షణలో భాగంగా గురువారం భూములను సర్వే చేసే విధానాన్ని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్, ప్రభుత్వ సర్వేయర్ శ్రీహరిని భూముల సర్వే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి గ్రామ శివారులోని రవి అనే రైతుకు సంబంధించిన సర్వే నం.261, 262లలో ఉన్న సుమారు 18 ఎకరాల పొలానికి సర్వేయర్ సమక్షంలో భూ సర్వేను పూర్తి చేసి 18 ఎకరాల పొలానికి హద్దులను గుర్తించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలపై సమగ్ర విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ రికార్డు అసిస్టెంట్ మహేశ్ పాల్గొన్నారు.


చేవెళ్లరూరల్ : ధర్మసాగర్ గ్రామంలో


చేవెళ్లరూరల్ : రావులపల్లి గ్రామంలో..

మొయినాబాద్ : అండాపూర్‌లో బోనమెత్తిన మహిళ



మొయినాబాద్ : అండాపూర్‌లో..


మొయినాబాద్ : అండాపూర్‌లో..


చేవెళ్లరూరల్ : మల్కాపూర్ గ్రామంలో..

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- మొయినాబాద్ మండలంలో ముగిసిన బోనాల ఉత్సవాలు
- చేవెళ్ల, నందిగామ మండలాల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపు

మొయినాబాద్, ఆగస్టు 1 : మొయినాబాద్ మండలంలో గురువారంతో ఆషాఢ బోనాల ఉత్సవాలు ముగిశాయి. అండాపూర్, పెద్దమంగళారం, కేతిరెడ్డిపల్లి, బాకారం, మేడిపల్లి, ఖాసింబౌలిలో రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. అండాపూర్‌లో రక్త మైసమ్మకు, పెద్దమంగళారంలో కట్ట మైసమ్మకు బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలు డప్పు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు.

### చేవెళ్ల మండలంలో..

**చేవెళ్ల రూరల్ :** చేవెళ్ల మండల పరిధిలో రావులపల్లి, ధర్మసాగర్, మల్కాపూర్ తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో రావులపల్లి మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

### జంగోనిగూడలో..

**నందిగామ :** నందిగామ మండలం జంగోనిగూడలో పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించారు.


చేవెళ్ల టౌన్ : చేవెళ్లలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


బడంగ్‌పేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు


ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా బడంగ్‌పేటలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


చేవెళ్లటౌన్ : చేవెళ్లలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

# ఊరూరా నిరసన

## మహిళలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు..

- గ్రేటర్ పరిధిలో పలు చోట్ల నిరసనలు, ఆందోళనలు
- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- సీఎం, డిప్యూటీ సీఎం దిష్టి బొమ్మలు దహనం
- బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టులు, నిర్బంధాలు..

అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పి.సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమన్నది. అభ్యంతరకర వ్యాఖ్యలపై నిరసనగా గురువారం బీఆర్ఎస్ శ్రేణులు నగర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు, రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. నగరంతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం, డిప్యూటీ సీఎం దిష్టి బొమ్మలను దహనం చేశారు. చాలా చోట్ల నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు చేతబూని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అలాగే రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలు చోట్ల నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ శ్రేణులు


బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిజాం కళాశాల నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులు షిగ వెంకట్ గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాష్ తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు


హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా, నాయకులు


మణికొండ మర్రిచెట్టు కూడలి వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో... మూడు కోతుల బొమ్మల చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు